www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 21 డిసెంబర్ 2023
5
అన్నమయ్య

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయండి

- డిఇఒ శ్రీరాం పురుషోత్తం

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటిలోని అర్చనా విద్యా సంస్థలలో ఈ నెల 23 తేదీన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించనున్నామని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తం తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ఎంపికైన మూడు ప్రాజెక్టులు మాత్రమే జిల్లా స్థాయి ప్రదర్శనలో ప్రదర్శించాలని పేర్కొన్నారు. టీచర్ కేటగిరీలో టీచర్ మాత్రమే తన ప్రాజెక్టును ప్రదర్శించాలని తెలిపారు. విద్యార్థిని అనుమతించరని తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులకు మరింత మెరుగులు దిద్ది జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయికి ఎంపికై హాజరుకాని వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. జిల్లా స్థాయి ప్రదర్శన నుండి ఒక్కొక్క కేటగిరి నుండి మూడు ప్రాజెక్టుల చొప్పున మొత్తం తొమ్మిది ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

వెనక్కు తగ్గని అంగన్వాడీలు

- భిక్షాటన, చెవిలో పువ్వులు, మోకాళ్లపై నిల్చుని వినూత్నంగా నిరసన
- జిల్లా వ్యాప్తంగా 9వ రోజు కొనసాగిన సమ్మె

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 9వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఆయా కార్యాలయాల ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా వ్యాప్తంగా భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.

బి.కొత్తకోట : భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అంగన్వాడీల సమ్మె తొమ్మిదో రోజు భిక్షాటన చేస్తూ తెలిపిన నిరసన విజయవంతమైందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, అంగన్వాడీ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాగ్య లక్ష్మి తెలిపారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు అంగన్వాడీలు చేస్తున్న సమ్మె సందర్భంగా పట్టణంలోని దుకాణాదారులు, వ్యాపార సంస్థలు, పేద మధ్య తరగతి ప్రజానీకం, వ్యాపారస్తులు, తోపుడు బండ్లు, ఉపాధ్యాయులు, అన్ని వర్గాల ప్రజల వద్దకు వెళ్లి అంగన్వాడీలు భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆదరించి అంగన్వాడీలకు ప్రభుత్వం చేస్తున్న మోసపూరితమైన చర్యలకు వ్యతిరేకంగా జరుగుతున్న సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీలు సిద్దమ్మ, బంగారుపాప, ఖాజాబి, విజయమ్మ, నాగమణి, సబీనా, ప్రవీణ, అరుణ, పద్మజ, అమ్ములు, చంద్రకళ, శంకరమ్మ, సుమలత, భూదేవి, హమాలీ నాయకులు మాధవయ్య పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుంచి అగ్నిమాపక కేంద్రం మీదుగా ర్యాలీగా తరలి వెళ్లి దుకాణాల వద్ద భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ ఒక్క అవకాశం అన్నందుకు జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకున్న పాపానికి మహిళలు రోడ్లెక్కి భిక్ష ఎత్తుకోవాల్సిన పరిస్థితి ఎదురైందని ఆరోపించారు. నిరసనకు మున్సిపల్ కార్మికులు పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రమాదేవి, సుజాత, ఈశ్వరమ్మ, శివరంజిని, విజయ, అమరావతి పాల్గొన్నారు. **పీలేరు:** మహిళలతో పెట్టుకున్న ప్రభుత్వాలు గెలిచిన దాఖలా ఎప్పుడూ లేదని సిఐటియు, ఎఐటియుసి నాయకులు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ముందు చెవిలో పూలతో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం పగులగొడుతోంది అంగన్వాడీ కేంద్రాల తాళాలు కాదని, వాటిలో పనిచేసే సిబ్బంది గుండెలని అన్నారు. ప్రభుత్వం సత్వరం తగిన చర్యలు తీసుకుని అంగన్వాడీ కార్యకర్తలు, మినీ వర్కర్లు, సహాయకుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో సమ్మె ఉధృతిని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు దనాసి వెంకటరామయ్య, ఎఐటియుసి నాయకులు నరసింహులు, సాంబశివ, పీలేరు నరసింహులు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సరళమ్మ, రెడ్డమ్మ, శారద, ప్రేమ, ఎల్లమ్మ, రూప, సుహాసిని, శోభ తదితరులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** తమ డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెకు దిగిన అంగన్వాడీలుం ప్రతిరోజు వినూత్న రీతిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నారు. పట్టణంలో భిక్షాటన చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, మదనపల్లి సీనియర్ నాయకులు హరీందర్ శర్మలు హాజరయ్యారు. పట్టణంలోని జయశ్రీ కాలనీ నుంచి నగర పంచాయతీ కార్యాలయం, దిగువ బస్టాండ్, జ్యోతి చౌక్ వరకు భిక్షాటన చేసి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించమని ప్రభుత్వాన్ని అంగన్వాడీలు అడిగితే పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాలని,గౌరవ వేతనం కాకుండా సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. **తంబళ్లపల్లి :**అంగన్వాడీలు భిక్షాటన చేశారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం ఉధృతి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** లక్కిరెడ్డిపల్లిలో దుకాణాలు, వర్తక వ్యాపారం దగ్గర భిక్షాటన చేస్తూ అంగన్వాడీలు నిరసన కార్యక్రమం చేపట్టారు. సిడిపిఒ కార్యాలయం వద్ద నుండి లక్కిరెడ్డిపల్లి టౌన్ దుకాణాలు వర్తక వ్యాపారం దగ్గర భిక్షాటన చేసి వారి మద్దతు కోస్తూ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షులు సుకుమారి ప్రాజెక్టు కార్యదర్శి ఓబులమ్మ సెక్టార్ లీడర్ ప్రభావతి, లక్ష్మీదేవి, రుక్మిణి, శారద పాల్గొన్నారు. **మదనపల్లి :** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తల ర్యాలీగా షాపులను తిరుగుతూ భిక్షాటన చేస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మధురవాణి, రాజేశ్వరి, కరుణ, స్వారూపా, భూకైలేశ్వరి, అమ్మాజీ, విజయ, అఖిరున్నిసా, బాగ్యా, గీతా సుజాని, శ్రీవాణి, ఈశ్వరి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

పీలేరు : చెవిలో పువ్వులతో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

రాయచోటి : భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

పేద విద్యార్థులకు వరం విద్యా దీవెన : కలెక్టర్

విద్యార్థులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్, జెసి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విదేశీ విద్యా దీవెన తోడ్పాటు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఒక వరమని కలెక్టర్ గిరిష తెలిపారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి 2023-24 సంవత్సరానికి జగనన్న విదేశీ విద్యా దీవెన జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం పథకాల ద్వారా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. అన్నమయ్య జిల్లాలో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద 10 మంది విద్యార్థులకు రూ.92.21 లక్షలు, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కింద ఆరుగురు విద్యార్థులు రూ.6.50 లక్షలు లబ్ధి పొందారు. రాయచోటి కలెక్టరేట్ విసి హాల్ నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చదవగలిగే ప్రతిభ ఉండి కూడా పేదరికం కారణంగా ఆర్థిక పరిస్థితులు అనుకూలించక విదేశి విద్యా సంస్థల్లో చదువుకోవాలన్న కోరిక ఉన్న వారికి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం బాసటగా నిలబడుతూ వారి విదేశీ విద్యకయ్యే పూర్తి ఫీజును ప్రభుత్వం భరిస్తోందన్నారు. యుపిఎస్‌సి నిర్వహించే అత్యున్నత సివిల్ సర్వీస్‌లలో ఆంధ్రప్రదేశ్ యొక్క ప్రాతినిధ్యం పెంచేందుకు సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యర్థులకు జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకం ద్వారా రూ. ఒక లక్ష రూ.50 వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది అన్నారు. విద్యార్థులందరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలిన్నారు. విదేశీ విద్య ద్వారా లేదా సివిల్ సర్వీస్ ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకున్న పిదప మన రాష్ట్రాన్ని గుర్తుంచుకొని ఏదో ఒక విధంగా తిరిగి రాష్ట్రానికి మంచి చేయాలనే సంకల్పం కలిగి ఉండాలన్నారు. ఉన్నతమైన చదువులు చదివేందుకు ప్రభుత్వం పేదవారికి ఎప్పుడూ తోడుగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి విద్యారంగంలో అనేక విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారు. అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలను అమలు చేస్తున్నారు. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలనే మార్చేశారు అన్నారు. పేద విద్యార్థులకు మంచి విద్యను అందించాలనే ఉద్దేశంతో ఇంగ్లిషు మీడియంతో పాటు విద్యార్థులకు బై జూస్ ద్వారా బోధన, ట్యాబ్ లను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్ళాలంటే విద్యతోనే సాధ్యంనీ దీనిని దృష్టిలో ఉంచుకొని పోటీ ప్రపంచంలో ఎదిగేందుకు ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని యువత ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. అనంతరం "జగనన్న విదేశీ విద్యా దీవెన" పథకం కింద 10 మంది విద్యార్థులకు రూ.92.21 లక్షలు "జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం" కింద ఆరుగురు విద్యార్థులకు రూ.6.50 లక్షల మెగా చెక్కులను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కలెక్టర్, జెసి అందజేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డిడి జాకీర్‌హుస్సేన్, బిసి సంక్షేమశాఖ అధికారి సందప్ప, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి : 'సిటు'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఎస్ఎస్ఎ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఎ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం రూ.పది లక్షలివ్వాలని పేర్కొన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ కల్పించాలన్నారు. ఉద్యోగులు రమణ, నరసింహులు, సుధాకర్, మహేష్, ఆలీ, రాజులు మాట్లాడుతూ మెడికల్ లీవ్‌లు ఇవ్వాలన్నారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, ఉద్యోగ భద్రతతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. సుప్రీం తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం గ్రాట్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులతో పాటు సిఐటియు నాయకులు భాగ్యలక్ష్మి, ప్రసన్న, మాధవయ్య ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జాబీర్

ఇంటింటికీ సహకార బ్యాంకు సేవలు : డిసిసిబి సిఎం

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

ప్రజాశక్తి-సంబేపల్లి (రాయచోటి)

జిల్లాలోని ప్రతి ఇంటికి సహకార బ్యాంకు సేవలు అందేలా చూస్తామని రాయచోటి డిసిసిబి చీఫ్ మేనేజర్ వై.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం సంబేపల్లి మండలం మోటకట్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో కడప డిసిసి బ్యాంక్ ఆధ్వర్యంలో అక్టోబర్ 31 నుంచి జనవరి 30, 2024 సంవత్సరం వరకు ఇంటింటికీ సహకారం గడపగడపకు కడప డిసిసి బ్యాంకు అనే సహకార సమైక్య పదంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి డిసిసి బ్యాంక్ పొదుపు ఖాతాలు, కరెంటు అకౌంట్స్, చిన్నపిల్లలకు పొదుపు ఖాతాలు (కిడ్డీ బ్యాంక్ అకౌంట్స్) వాటి ఆవస్యతక గురించి రైతులకు వివరించారు. ప్రతి రైతుకూ పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు ఇస్తామని పేర్కొన్నారు. డిసిసి బ్యాంకులో బంగారు మీద రుణాలు, మహిళలకు డ్వాక్రా, రుణాలను, గృహ రుణాలు, విద్యా రుణాలను, అతి తక్కువ వడ్డీకే ఇస్తున్నామని తెలిపారు. డిసిసి బ్యాంక్ ఈ రోజు అన్ని బ్యాంకుల కంటే ముందు ఉందని చెప్పారు. అన్ని అవసరాలకు కావలసిన రుణ సదుపాయాలను అతి తక్కువ వడ్డీకే తక్కువ సమయంలో ఇస్తున్నామని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంబేపల్లి పాక్స్ చైర్మన్ ఎస్.వెంకటరమణారెడ్డి, డైరెక్టర్ నాగరాజ యాదవ్, డిసిసి బ్యాంకు సూపర్‌వైజర్ ప్రదీప్‌రెడ్డి, సంబేపల్లి సిఇఒ, రైతులు, ప్రజలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న మునిసిపల్ కార్మికులు

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు డిమాండ్ల సాధన కోసం ఈనెల 26 నుంచి రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెలో పాల్గొననున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్మికులతో కలిసి కమిషనర్ ఎం.జనార్ధన్‌రెడ్డికి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత రెండు సంవత్సరాలుగా వివిధ రూపాలలో తాము ఆందోళన చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించ లేదని అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, అందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేయాలని, సిబ్బందిని పెంచాలని, కార్మికులకు పనిముట్లు, రక్షణ కిట్లు అందించాలని, మృతి చెందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబంలోని వ్యక్తికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.ఓబయ్య, జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి, డివిజన్ అధ్యక్షులు ప్రసాద్, కార్యదర్శి బాలాజీ, కార్మికులు సాలమ్మ, రమణ, రవిశంకర్ పాల్గొన్నారు.

నేడు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-రాయచోటి

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా అన్ని మండల కేంద్రాల్లో మండల స్థాయి చెకింగ్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో 8, 9, 10 తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఒక టీంగా ఏర్పాటు చేస్తామన్నారు. వారు మండల స్థాయిలో పోటీ పడతారని తెలిపారు. జిల్లాలోని 30 మండల కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్షలు మొదలవుతాయని పేర్కొన్నారు. 250 పాఠశాలల నుంచి 17 వేల మంది విద్యార్థులు చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొంటారని తెలిపారు.

24న పుస్తకాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యులు ఎన్.ఈశ్వరరెడ్డి రచించిన 'నాలో నువ్వు' (కవిత్వం) 'సాహిత్యంలో సమాజం' (విమర్శ) పుస్తకాల ఆవిష్కరణ సభ ఈనెల 24వ తేదీ 10 గంటలకు నగరంలోని సి.పి.బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఎం.ప్రభాకర్ నాయక్, కొండూరు జనార్ధనరాజు, డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సూర్య ఛారిటబుల్ ట్రస్ట్ రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు సభాధ్యక్షులుగాఎస్‌వియూ ప్రాచ్య పరిశోధనా సంస్థ సంచాలకులు ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు వ్యవహరిస్తారు. ముఖ్యఅతిథిగా వైవియూ విసి ఆచార్య చింతా సుధాకర్, విశిష్ట అతిథిగా ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం రిజిస్టర్ ఇ.సి.సురేంద్రనాథ రెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె చిన్నపరెడ్డి ఆత్మీయ అతిథిగా, సూర్య ఛారిటబుల్ ట్రస్ట్, ఎన్ఆర్ఐ వ్యవస్థాపకులు డాక్టర్ గొర్ల సూర్యనారాయణ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు డాక్టర్ పి.సంజీవమ్మ ప్రత్యేక అతిథులుగా రానున్నారని తెలిపారు. 'నాలో నువ్వు' పుస్తకాన్ని ఎపి అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య, 'సాహిత్యంలో సమాజం' పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీపురస్కార గ్రహీత గ్రహీత డాక్టర్ వేంపల్లి షరీఫ్ సమీక్షిస్తారని పేర్కొన్నారు. బండి ఆనందరెడ్డి, నందనూరు సుగాత్రి దంపతులు నాలో నువ్వు అనే పుస్తకాన్ని స్వీకరిస్తారని తెలిపారు. అరసం కడప జిల్లా శాఖ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.రాజగోపాల్‌రెడ్డి సభా సమన్వయం చేస్తారని పేర్కొన్నారు. సాహితీ అభిమానులు, పుస్తక ప్రేమికులు అందరూ ఆహ్వానితులేనని తెలిపారు.

లక్కిరెడ్డిపల్లి ఎస్ఐగా విష్ణువర్ధన్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

బాధ్యతలు స్వీకరిస్తున్న విష్ణువర్ధన్

లక్కిరెడ్డిపల్లి ఎస్ఐగా ఎం.విష్ణువర్ధన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ఎల్ల వేళలా కృషి చేస్తానని చెప్పా నని చెప్పారు. మట్కా జూదంపై ఉక్కు పాదం మోపుతానని తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యక లాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు కక్షలు, కార్పణ్యాలకు తావివ్వకుండా శాంతియుతంగా జీవనం సాగించాలని కోరారు. చిన్నపాటి గొడవలను సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకరించాలని కోరారు.

క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేయండి : గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

విసిలో పాల్గొన్న కలెక్టర్, జెసి

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలిని కలెక్టర్ గిరీష అధికారులకు సూచించారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆడదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరీష, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 26 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆడదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలకు సంబంధించి ఇప్పటికే క్రీడా సామాగ్రి అన్ని మండలాలలోని సచివాలయాలకు పంపడం జరిగిందన్నారు. ఇందులో ప్రధానంగా గ్రౌండ్ ప్రిపరేషన్ ప్రక్రియను పూర్తి చేసుకో వాలన్నారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు స్వయంగా మైదా నాలను పరిశీలించాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ప్రతి ఆటకు సంబంధించి కనీసం రెండు జట్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 26 వ తేదీన ప్రారంభించే కార్యక్రమానికి సంసిద్ధత కోసం 25న మండల స్థాయి,మున్సిపాలిటీ స్థాయిలో సంబంధిత సిబ్బంది అందరితో సమన్వయ సమావేశం నిర్వహించాలన్నారు. ఎంపిడిఒలు, మునిసిపల్ కమిషనర్లు, నియోజక వర్గ ప్రత్యేక అధికారులు ప్రేక్షకులను, క్రీడా కారులను సమన్వయం చేసి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేలా, మారుతున్న జీవన శైలిలోని ఒత్తిడిలను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర ద్వారా గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రికెట్, వాలీబాల్, బాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని, 15 సంవత్సరాల వయసు నిండి ఆసక్తి కలవారు పోటీలలో పాల్గొనవచ్చునన్నారు. గ్రామ స్థాయిలో పాల్గొని గెలిచిన వారికి మండల స్థాయిలో, మండల స్థాయిలో గెలిచిన వారికి జిల్లా స్థాయిలో, జిల్లా స్థాయిలో గెలిచిన వారికి రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. కావున అన్నమయ్య జిల్లాలోని క్రీడాకారులందరూ ఈ పోటీలలో పాల్గొని రాష్ట్ర స్థాయిలో గెలిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ రామలింగారెడ్డి

ఉద్యోగాలకు ఎంపికైన 'ఆదిత్య' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక పుంగనూరు రోడ్డులో గల ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్. ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. తిరుపతిలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్ టెలికాం సర్వీసెస్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీవారు జరిపిన ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలలో కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్న కె.హేమకిరణ్‌సాయి, ఎల్.హేమతరుణ్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ కంపెనీ ప్రధాన కార్యాలయంలో ఉత్తరప్రదేశ్‌లోని గౌతమ్‌బుద్ధనగర్‌లో ఉందన్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులు రేణిగుంటలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్, హెడ్ ఆఫ్ మెకానికల్ డాక్టర్ వివిఎన్.భాస్కర్, టిపిఒ మనోజ్‌కుమార్, అధ్యాపకులు ఎన్.వెంకటరమణారెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు.

తేక్వాండోలో ప్రతిభ చాటిన 'విజ్‌డమ్' విద్యార్థి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్

పట్టణంలోని విజ్‌డమ్ ఇంగ్లీష్ మీడియంహై స్కూల్‌లో రెండవ తరగతి చదువుతున్న బి.మహతి అనే విద్యార్థి తేక్వాండోలో ఉత్తమ ప్రతిభ కనబరచి రజత పతకం సాధించిందని కరస్పాండెంట్ డాక్టర్ టి.ప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతవారం తిరుపతిలో జరిగిన ఇంటర్ స్కూల్ తేక్వాండో పోటీలలో మహతి పాల్గొని అద్భుత ప్రదర్శన కనబరిచిందని అన్నారు. రజత పతకం సాధించిన మహతిని ప్రిన్సిపల్ టి.ప్రియాంక, అడ్మిన్ డైరెక్టర్ టి.మదన్మోహన్‌లు అభినందించారు.

పరీక్షలను పర్యవేక్షిస్తున్న అబ్జర్వర్ సుధాకర్

ప్రశాంతంగా డిగ్రీ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-గాలివీడు

డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. స్థానిక ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో అబ్జర్వర్‌గా సుధాకర్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపల్ జయచంద్ర రెడ్డి మాట్లాడుతూ మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న డిగ్రీ విద్యార్థులకు జనవరి 9వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మొదటి సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. మండలంలోని డిగ్రీ కళాశాలల్లో 265 మంది డిగ్రీ పరీక్షలు రాస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, మినీ అంగన్వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలిందిగా సిడిపిఒ టిపి సౌభాగ్యమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుల్లంపేట మండలంలో దేవసముద్రం అంగన్వాడీ కార్యకర్త, ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఓబులవారిపల్లె మండలం, కాకర్లవారిపల్లెలో అంగన్వాడీ కార్యకర్త, సిఎం బలిజపల్లెలో ఆయా, జీవిపురం అంగన్వాడీ కేంద్రాల్లో ఆయా, ఎల్లాయపల్లె మినీఅంగన్వాడీ కార్యకర్త పోస్టు, కోడూరు మండలంలోని గంగరాజుపురం అంగన్వాడీ ఆయా పోస్టు, గుండాలపల్లె అంగన్వాడీ ఆయాపోస్టు, సెట్టిగుంట-2 అంగన్వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. **తంబళ్లపల్లి:** తంబళ్లపల్లె మండలం లోని మంద్యం వారి పల్లె అంగన్వాడీ వర్కర్ బిసిబి అభ్యర్థులకు, కొట్టాల అంగన్వాడీ హెల్పర్ ఎస్‌సి, మర్రి మాకులపల్లె అంగన్వాడీ హెల్పర్ ఒసి, కురబలకోట మండలం భద్రన్న గారి పల్లె అంగన్వాడీ వర్కర్ బిసి, పెద్దమండ్యం మండలం గుడిసెవారిపల్లె అంగన్వాడీ హెల్పర్ ఒహెచ్, కేటగిరిలకు రిజర్వేషన్ కేటాయించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఒహెచ్ కేటగిరి అభ్యర్థులు సదరన్ క్యాంప్‌లో కచ్చితంగా పొందుపరచాలన్నారు. సదరన్ క్యాంప్ సర్టిఫికెట్ కచ్చితంగా ఇవ్వాలన్నారు. 21 సంవత్సరం నుంచి 35 సంవత్సరాల లోపు స్థానికులైన వాహితులై ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు కచ్చితంగా 10వ తరగతి పాసై ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 23వ తేదీ సాయంత్రంలోపు తంబళ్లపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

రోగులకు పండ్లు అల్పాహారాన్ని అందిస్తున్న వైసిపి నాయకులు

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-నందలూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ముందస్తుగా మంగళవారం జిల్లా వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్ ఆధ్వర్యంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న రోగులకు, వృద్ధులకు పండ్లు, అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25లక్షల వరకు పెంచి పేదలపై తనకు ఉన్న ప్రేమను చాటుకున్నారని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, మండల కో-ఆప్షన్ సభ్యులు కలీముల్లా ఖాన్, వైసిపి సీనియర్ నాయకులు ఆర్యంగం విశ్వనాథ్, ఎస్‌సి సెల్ ఉమ్మడి జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు పెనుబాల నాగను బ్యాయ్య, మైనారిటీ నాయకులు మస్తాన్ అలీ ఖాన్, చోటా నూర్ పాల్గొన్నారు.

గిరిజనులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-పీలేరు

కెవిపల్లి మండలంలోని మఠంపల్లి గ్రామపంచాయతీ, కలికిరి వాండ్లపల్లిలో నివసిస్తున్న గిరిజనులకు ఇంటి స్థలాలు కేటాయించి పక్కా గృహాలు నిర్మించాలని సిపిఐ, ఎస్‌ఎస్‌యుఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కెవిపల్లి తహశీల్దార్ కార్యాలయంలో వారు గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ స్థలంలో నివసిస్తున్న గిరిజనులకు చెందాల్సిన స్థలాన్ని వారికి ఇవ్వకుండా జాప్యం చేయడం తగదని అన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి వారికి తగిన న్యాయం చేయాలని, లేని పక్షంలో గిరిజనులకు మద్దతుగా తమ నిరసనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు నరసింహులు, సాంబశివ, రియల్ వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు, పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు మద్దెల అమృతేజ, పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

మైదుకూరు : విద్యార్థి దశ నుంచే విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని నంద్యాలంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రమణయ్య సూచించారు. మండలంలోని ఎస్ ఉప్పలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సుంకులమ్మపల్లె ప్రాథమిక పాఠశాలలో బుధవారం అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా వెంకటరమణయ్య మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, గురువులకు గౌరవం ఇచ్చి చదువుకోవాలని విద్యార్థులను కోరారు. విద్యా అమృత్ మహోత్సవ్ ప్రాజెక్టు ద్వారా జాతీయస్థాయిలో మొదటి స్థానంలోకి పాఠశాలను తీసుకురావడానికి కృషి చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగలక్ష్మీదేవిని ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో శివశంకర్, నేస్తం సేవ సంస్థ ప్రతినిధి కొండం కొండారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు వరలక్ష్మీ, మహేశ్వర పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షులుగా 'సాకే'

ప్రొద్దుటూరు : ఎపి ఎంఆర్‌పిఎస్ యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సాకే నారాయణస్వామి మాదిగను నియమించినట్లు ఎంఆర్‌పిఎస్ అధికార ప్రతినిధి అమ్ముంటిచ్చిన సుధాకర్ మాదిగ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా దాసరి దాసరిగారి రాజేశ్వరిని నియమించామన్నారు. రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు మాదిగ ఆదేశాల మేరకు నియమించామన్నారు. వచ్చే ఏడాది జనవరి 20న కడప మున్సిపల్ గ్రౌండ్‌లో జరుగుతున్న మాదిగ ఉప కులాల రాజకీయ సమన్యాయ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం

కడప : లీగల్ లిటరసీ క్లబ్‌లో ఉన్న న్యాయ సంబంధిత పుస్తకాలను చదివి చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రెటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఉన్న లీగల్ లిటరసీ క్లబ్‌ను బుధవారం ఆయన సందర్శించారు. న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం-2015 వివరించారు. కార్యక్రమంలో గాంధీనగర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సత్య సుజాతమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎంపిపి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిపి లక్ష్మీనరసమ్మ పేర్కొన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ శంకరయ్య ఆధ్వర్యంలో ఎంపిపి లక్ష్మీ నరసమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జడ్‌పిటిసి రామచంద్రయ్యయాదవ్, ఎస్‌హెచ్‌ఒ డిఎస్‌పి డిఎస్‌పి జి.ఎన్. ప్రశాంత్, మండల ప్రత్యేక ఆహ్వానితుడు అరుణ్‌కుమార్‌రెడ్డిలు హాజరయ్యారు. మండల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఎంతో కృషి చేస్తున్నట్లు మండల ఎంపిపి తెలిపారు. జడ్‌పిటిసి రామచంద్రయ్య మాట్లాడుతూ ఆర్‌టిసి బస్సులు బస్‌స్టాపులో నిలపకుండా వెళ్ళిపోతున్నారని బస్సులు అందుబాటులో ఉద్యోగరీత్యా వస్తున్న అధికారులు సాయంత్రం సమయంలో తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని మండిపడ్డారు. ఎంపిడిఒ శంకరయ్య మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సమావేశానికి వచ్చినప్పుడు ప్రతి శాఖకు చెందిన అధికారులు మూడు రోజుల ముందే నివేదిక సమర్పించాలని తెలిపారు. మూడు సర్వసభ సమావేశాలకి హాజరు కాని ఎంపిటిసిలపై రాజ్యాంగ బద్ధంగా వారిని పదవి నుంచి తొలగిస్తామని వెల్లడించారు. విద్యుత్‌శాఖ ఎఇ గిరిధర్ మాట్లాడుతూ జగనన్న కాలనీలకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు 90 లక్షల వరకు ఖర్చయిందని తెలిపారు. ఎంఇఒ రెడ్డిశేఖర్ మాట్లాడుతూ 69 ప్రభుత్వ పాఠశాలలకు వంటసామగ్రి పాత్రలు మంజూరయ్యాయని, ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 170 ల్యాప్‌టాప్‌లు వచ్చాయని తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ అధికారి మంజుల, ఎంఇఒలు రెడ్డిశేఖర్, భువనేశ్వరాచారి, ఆర్ఐ బాలాజీ, కానిస్టేబుల్ శ్రీనివాసులు, ఎంపిటిసిలు సుబ్బయ్య నాయుడు, రామ సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు వేమలేటి కోటి రవి, గుడిపల్లి సర్పంచ్ రఘు, బడికాయలపల్లి సర్పంచ్ ఆదెప్పగౌడ్. వైస్ ఎంపిపిఖాదర్‌వలీ, ఎంపిడిఒ ఎఒ థామస్, జూనియర్ అసిస్టెంట్ ప్రతాప్, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ శంకరయ్య

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఇఒలు

ప్రజాశక్తి-పుల్లంపేట

సైన్స్ పట్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందాలని తహశీల్దార్ నరసింహకుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం లోని ఎస్‌బివివిడి సభ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఎంఇఒలు చక్రధర్‌రాజు, నాగతిరుమలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహశీల్దార్ నరసింహాకుమార్ హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించిన వివిధ నమూ నాలను తిలకించి వాటి ప్రయోజనాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పదాలు పెంపొందించడానికి సైన్స్ ఫెయిర్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థి దశ నుంచి సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సైన్స్‌తోనే మానవ మనుగడ సాధ్యమని అన్నారు. వ్యక్తిగత, గ్రూపు, ఉపాధ్యాయులకు సంబం ధించి మూడు ప్రయోగాలు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంఇఒలు తెలిపారు. కార్యక్రమంలో సభసంస్థల కరస్పాండెంట్ శ్రీరాములు, ప్రధానోపా ధ్యాయులు కృష్ణకుమార్, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో 'మిట్స్'కు అరుదైన గుర్తింపు

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపంలో గల మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌కు మాట్ ల్యాబ్ నుంచి అరుదైన గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. జాతీయ స్థాయిలో మాట్‌ల్యాబ్ కాలేజ్‌వైడ్ క్రెడెన్షియల్ ప్రోగ్రామ్‌లో భాగంగా కళాశాలలోని విద్యార్థులు, అధ్యాపకులు మాట్ ల్యాబ్ సాఫ్ట్‌వేర్‌ను అధిక భాగంలో ఉపయోగించి వివిధ పరిశోధనలు చేసినందుకు గాను ఐడెం టిఫైడ్ ఇన్స్టిట్యూట్ గుర్తింపు లభించిందని అన్నారు. బెంగళూరుకు చెందిన మాత్ వర్క్స్ ఎడ్యుకేషన్ సేల్స్ మేనేజర్ జహిదా వసీం చేతుల మీదుగా గుర్తింపు ధ్రువీకరణ పత్రాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్‌కు అందించారు. జాతీయ స్థాయిలో 40 కళాశాలలకు ఈ గుర్తింపు రాగ అందులో మిట్స్ కళాశాల ఒకటని అన్నారు. కార్యక్రమంలో విభాగాది . పతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన విద్యార్థులతో ప్రిన్సిపల్ యువరాజ్

నలుగురు సంతానమున్నా..దిక్కులేని స్థితిలో వృద్ధుడు

దీనస్థితిలో ఉన్న నన్నేసాహెబ్

సపర్యల అనంతరం వృద్ధుడిని ఆస్పత్రికి తీసుకెళుతున్న శంకర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నేటి ఆధునిక సమాజంలో మానవత్వం మంటగలుస్తోంది. కుటుంబ వ్యవస్థలు రోజురోజుకు దిగజారిపోతున్నాయి. వయసు మీరిన తల్లిదండ్రులను కన్నబిడ్డలే వీధిపాలు చేస్తున్నారు. బద్వేల్ మండలానికి చెందిన నన్నేసాహెబ్‌కు నలుగురు సంతానం. నలుగురికీ వివాహాలై స్థిమితంగానే ఉన్నట్లు తెలుస్తోంది. నన్నే సాహెబ్‌ను ఎవరూ చేరదీయకపోవడంతో గత కొంతకాలంగా రాజంపేటలోని నూనెవారిపల్లి పరిసరాలలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తూ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై ఐసిడిఎస్ కార్యాలయం వద్ద గల జర్నలిస్టు బిల్డింగ్ వద్ద అపస్మారక స్థితిలో పడిపోయాడు. వృద్ధుడిని గమనించిన గుండాలపల్లెకు చెందిన కురపాటి శంకర్ అనే వ్యక్తి ఆ వృద్ధుడికి తల వెంట్రుకలు, గడ్డం తీయించి, స్నానం చేయించి కొత్త బట్టలు మార్చి సపర్యల అనంతరం స్థానిక సర్వజనాసుపత్రిలో చేర్పించారు. నన్నే సాహెబ్ కుమారుడు మహ బూబ్‌బాషా రైల్వేకోడూరులో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. వైసిపి నాయకులు గుల్జార్‌బాషా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నన్నేసాహెబ్‌ను పరామర్శించి ఆయన కుమారుడి వివరాలు సేకరించారు. రైల్వే కోడూరు జామా మసీదు మాజీ అధ్యక్షులు మస్తాన్‌తో కలిసి వృద్ధుడిని తన కుమారుడి చెంతకు చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. వృద్ధుడిని చేరదీసి ఆదరించిన గుండాలపల్లి శంకర్, గుల్జార్‌బాషాలను స్థానిక ప్రజలు అభినందించారు. ఆ వృద్ధుడి కుటుంబ సభ్యుల గుండె కరిగి ఆయనను అక్కున చేర్చుకుంటారని ఆశిద్దాం.

ఉపాధ్యాయుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి విజయకుమార్, మహేష్‌బాబు అన్నారు. స్థానిక నడింపల్లె ఉర్దూ పాఠశాలలో బుధవారం మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్, మండల పరిషత్ ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం.. మున్సిపల్ ఉపా ధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. బదిలీలు, పదోన్నతుల్లేక మున్సిపల్ ఉపాధ్యాయులు ఇబ్బం దులుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి పట్ల రాష్ట్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతోందన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో అన్ని పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. 2022జూన్‌లో మున్సిపల్ ఉపా ధ్యాయుల సర్వీసులు మున్సిపల్ యాజమాన్యం నుండి పాఠశాల విద్యాశాఖ పర్యవేక్షణలోకి వచ్చాయని యుటిఎఫ్ ప్రత్యేకకృషి వల్ల సేవా పుస్తకాలు, క్యాడర్‌స్ట్రెంత్ సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఈనెల 30న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రవీంద్రుడు, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గంగాధర్, గంగన్న, గౌరవాధ్యక్షులు కొండయ్య, జిల్లా కౌన్సిలర్ నాగరాజు, రాష్ట్ర నాయకులు రఫీయుద్దీన్, ప్రధానోపాధ్యాయులు ఇమామ్‌హుశేన్ పాల్గొన్నారు.

సదస్సులు రైతుకు బలాన్నిస్తాయి

ప్రజాశక్తి - మైదుకూరు

అవగాహన సదస్సులు రైతులకు బలాన్నిస్తాయిన డాక్టర్ వైఎస్‌ఆర్ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ తెలిపారు. మండలంలోని వనిపెంట కెవికె కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కరుణశ్రీ మాట్లాడుతూ పంట సాగులో అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమస్యలు ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటాయని, సదస్సులు రైతులకు కొత్త బలాన్నిస్తాయని పేర్కొన్నారు. వనిపెంట కెవికెలో ఈనెల 19 నుండి 20వ తేదీ వరకు పసుపు సాగులో యాజమాన్య పద్ధతులపై జిల్లాస్థాయి అవగాహన సదస్సులు నిర్వహించారు. బుధవారం పులివెందుల అరటి పరిశోధన సంస్థ అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుశీల ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ నారం నాయుడు ముఖ్యఅతిథిగా పసుపు సాగులో మనదేశంలో ప్రస్తుత పరిస్థితులు పరిశోధనలో వెల్లడైన కొత్త విషయాలు, మైదుకూరు పసుపు రకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. వనిపెంట కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం బాలకృష్ణ పసుపు సాగులో ఎదుర్కొంటున్న సమస్యలు, స్థానికంగా ఎదురవుతున్న సవాళ్ల గురించి వివరించారు. సదస్సులో శాస్త్రవేత్తలు, రైతులు హాజరయ్యారు.

నిరంతరం విద్యుత్ అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రజలకు నిరంతరాయం విద్యుత్ అందించడానికి సిబ్బంది కృషి చేయాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి రమణ సూచించారు. సింహాద్రిపురం సబ్ స్టేషన్‌లో బుధవారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా విద్యుత్ అందించాలన్నారు. సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ డిఇ శ్రీనివాసులు, ఎడిఇలు గురుమోహన్, శ్రీకాంత్, ఎఇ సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

బిపిఎంను పరామర్శించిన అధికారి

చక్రాయపేట : మండలంలోని బాల తిమ్మాయ గారిపల్లె(ఎస్‌ఒ) కొండవాండ్లపల్లి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ గంగిరెడ్డిని బుధవారం కడప సౌత్ సబ్ డివిజనల్ అధికారి సుబ్బరాయుడు పరా మర్శించారు. గంగిరెడ్డికి ఇటీవల గుండెకు సంబంధించి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పరా మర్శించి, ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సౌత్ సబ్ డివిజన్ గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం కార్యదర్శి శోభన్‌బాబు, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు నరహరి, నాగభూషణం పాల్గొన్నారు.

'లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతం'

కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర విజయవంతమైందని ఆపార్టీ సీనియర్ నాయకులు అలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. ఆ మేరకు బుధవారం ఆయన నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద యువగళం పాదయాత్ర విజయోత్సవ సంబరాల్లో భాగంగా బాణాసంచా పేల్చి, స్వీట్స్ పంచుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన పోవాలని, ప్రజలను చైతన్యపరుస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ లోకేష్ యువగళం పాదయాత్ర సాగిం దన్నారు. అడుగడుగునా ప్రభుత్వం ఇబ్బందులు పెట్టినా విజయ వంతమైందన్నారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలు, కష్టాలు తెలుసుకుంటూ యువగళం పాదయాత్రను పూర్తి చేశారని తెలిపారు. పాదయాత్ర పూర్తయిన సందర్భంగా విజయనగరంలో బుధవారం గొప్ప బహిరంగసభ నిర్వహించారన్నారు. టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో కడప జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, 13వ డివిజన్ ఇన్‌ఛార్జి బోగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మాజీ వార్డు నెంబర్ జయరామిరెడ్డి, తెలుగు యువత నగర ప్రధాన కార్యదర్శి హరినాథ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కుమారుడు మురళీమోహన్‌రెడ్డి, స్టేట్ మైనార్టీ కార్యదర్శి నజీర్, 47వ డివిజన్ సీనియర్ నాయకులు వీరభద్రయ్య, కడప జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు నాదెళ్ల దస్తగిరి, 39 వ డివిజన్ సీనియర్ నాయకులు ఇలియాజ్, గౌస్‌పీరు, చాన్‌బాషా, మహిళా సీనియర్ నాయకులు చిప్పాగిరి మీనాక్షి, తాటగిరి నిర్మల, అమరావతి, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ ప్రదర్శనలో రాష్ట్ర స్థాయికి రాహిత్య ఎంపిక

ప్రజాశక్తి-వేంపల్లె :

జాతీయ సైన్స్ ప్రదర్శనలో వేంపల్లె మహాత్మ జ్యోతిబాపూలే గురు కుల పాఠశాలకు చెందిన బి.రాహిత్య అనే విద్యార్థి రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శ నకు ఎంపికైనట్లు గురుకుల పాఠశాల ప్రిన్సి పల్ హరిత తెలిపారు. చాపాడు మండలంలోని ఢిల్లీ పబ్లిక్ పాఠశాలలో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనలో తమ పాఠశాల బి.రాహిత్య ప్రతిభ చూపినట్లు తెలిపారు.



బ్యాడ్మింటన్ నిర్వాహకులకు చెక్కును అందిస్తున్న సాయివికాస్‌రెడ్డి

6 నుంచి ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రోత్సహించేందుకు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనవరి 6, 7వ తేదీలలో రెండు రోజుల పాటు ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ముక్కా సాయివికాస్‌రెడ్డి మాట్లాడుతూ బాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచే క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులను ముక్కా ఫౌండేషన్ అందిస్తుందని తెలిపారు. టోర్నమెంట్ నిర్వహణకు ముందస్తుగా రూ.50వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో ఒబిలి ప్రసాద్‌రెడ్డి మల్లు సాయికుమార్‌రెడ్డి, ఓబిలి భారత్ కుమార్‌రెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ముక్కావారిపల్లి సర్పంచ్ ఆరవ శ్రీధర్, చిట్టి చరన్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఎల్ఐసిలో వేతన సవరణ చర్చలెప్పుడు?'

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎల్ఐసి యాజమాన్యం వేతన సవరణ చర్చలు తక్షణం నిర్వహించాలని సిబ్బంది సంఘాల జాయింట్ ఫ్రంట్ నాయకులు చంద్రపాల్, రఘునాథరెడ్డి, సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎల్ఐసి డివిజన్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందఠరేగా వారు మాట్లాడుతూ ఈ నెల 11, 12వ తేదీలలో చర్చలు అని ప్రకటించి, వాటిని వాయిదా వేయడంలో అంతర్యం ఏమిటని నిలదీశారు. బ్యాంకింగ్ రంగంలో వేతన సంవత్సరం చర్చలు కొలిక్కి వచ్చాయని, ఎల్ఐసిలో వేతన సవరణ గడువు ముగిసి 17 నెలలైనా ఇంకా చర్చలే ప్రారంభించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. 25 సంవత్సరాల పోటీ తర్వాత కూడా బీమా రంగంలో ఎల్ఐసిని అగ్రగామిగా, ప్రజలు ఆదరించే సంస్థగా నిలిపిన ఘనత సిబ్బందిదేనన్నారు. నూతన పెన్షన్ స్కీం వర్తించే సిబ్బంది విషయంలో 14 శాతం యాజమాన్య పిఎఫ్ వాటాపై తక్షణం నిర్ణయం ప్రకటించాలని కోరారు. సంస్థ అవసరాల మేరకు నూతన నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సంస్థ కార్యకలాపాలలో, సిబ్బంది సంబంధిత అంశాలలో యాజమాన్య ఏకపక్ష వైఖరిని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎల్లారెడ్డి, అక్బర్ బాషా, సరళ వారిజాతమ్మ, మహేశ్వర్ రెడ్డి, రాజు, కుమార్, అయ్యవా రెడ్డి, వసుప్రద, అమీనా పర్వీన్ పాల్గొన్నారు.

సిమెంట్ పరిశ్రమను సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి-కడప అర్బన్

కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ సివిల్ ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం అభ్యసిస్తున్న విద్యార్థులు అండర్ గ్రాడ్యుయేట్ కరికులంలో భాగంగా బుధవారం ప్రముఖ భారతీ సిమెంట్ ఖర్మగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పరిశ్రమ నిపుణులు సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు సిమెంట్ తయారీ ప్రక్రియ, ఉపయోగించిన యంత్రాలు, ఆధునిక సాంకేతిక, సైద్ధాంతిక భావనలు, ఉత్పత్తి ప్రక్రియను వివరించారు. విద్యార్థులు ప్రత్యక్షంగా గమనించారు. నిర్మాణ రంగంలో సిమెంట్ తయారికి ఉపయోగించే ముడి పదార్థం అవశ్యకత గురించి విద్యార్థులకు సందేశాలను చీఫ్ మేనేజర్ హ్యూమన్ రీసోర్స్ ఎస్.వి.గోపాల్ రెడ్డి నివృత్తి చేశారు. కార్యక్ర మంలో చీఫ్ మేనేజర్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ పి.భార్గవ్‌రెడ్డి, చీఫ్ మ్యానుఫ్యాక్చర్ ఆఫీ సర్ సాయి రమేష్, భారతీ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యానికి, కందుల గ్రూప్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్.మూర్తి, అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ ప్రేమ్ కుమార్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.అమ రనాథ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జి.వెంకటేశ్వర్లు, వి.వెంకట సుబ్బమ్మ, వై.దస్తగిరి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

- భర్త మృతి, భార్య పరిస్థితి విషమం

ప్రజాశక్తి-పీలేరు

భార్యభర్తలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహ నాన్ని కారు ఢీ కొనగా భర్త మృతిచెందగా, భార్య తీవ్రంగా గాయ పడిన కెవిపల్లి మండలం, గర్నిమిట్ట-సుండుపల్లి మార్గం లోని చింత మాకుల పల్లి సమీ పంలో జరిగింది. పోలీ సులు తెలి పిన వివరాల మేరకు.. మండలం లోని జిల్లెళ్ళమంద పంచాయతీ, బసన్న గారి పల్లికి చెందిన డి.చిన్న సిద్దయ్య (62), జయమ్మ దంపతులు పీలేరు నుంచి టివిఎస్ ద్విచక్ర వాహనంలో తమ స్వగ్రామానికి వెళుతుండగా సుండుపల్లి వైపు నుంచి ఎదురుగా వచ్చిన కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టినట్లు తెలిపారు. ఈ ఘటనలో సిద్దయ్య ఘటనా స్థలంలోని మృతి చెందాడని, తీవ్రంగా గాయపడిన జయమ్మను 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి నట్లు తెలిపారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రెఫర్ చేశారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం పీలేరు ప్రభుత్వ తీసు కువచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సిద్దయ్య, జయమ్మ దంపతులు(ఫైల్)

అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కర్ణాటక రాష్ట్రానికి టాటాఎస్ వాహనంలో అక్రమంగా పిడిఎస్ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న నిందింతుడిని అరెస్టు చేసి,28 బస్తాల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్టు బి.కొత్తకోట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒ ప్రశాంత్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వేపమానుగుంట గ్రామానికి చెందిన కె.నరసింహారెడ్డి పిడిఎస్ బియ్యం కొను గోలు చేశాడని, ఆ బియ్యన్ని కర్ణాటకకు తరలిస్తుండగా స్థానిక కస్తూర్బా గురు కుల పాఠశాల సమీపంలో వాహనాల తనిఖీలో భాగంగా పట్టుకున్నామన్నారు. రూ.12,684 విలువైన 28 బస్తాలలోని 1057 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.టాటాఎస్ వాహనాన్ని సీజ్ చేసి నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన వెల్లడించారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-రామసముద్రం

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. రామసముద్రం ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. రామసముద్రం మండలం నారిగానిపల్లి పంచాయతీ పూలకుంట్లపల్లి గ్రామానికి చెందిన లక్ష్మన్న కుమారుడు రంగప్పతో పుంగనూరు మండలం నెక్కొంది పంచాయితీ పెద్ద అలసాపురం గ్రామానికి చెందిన వెంకటరమణ, వెంకటమ్మల మూడవ కుమార్తె సావిత్రమ్మ అలియాస్ సావిత్రితో 18 సంవత్సరాల క్రితం వివాహం జరిపించారని తెలిపారు. వీరికి ఇద్దరు సంతానమని వైష్ణవి, వేణులని తెలిపారు. రంగప్ప కుటుంబ పోషణను పట్టించుకోకుండా తిరుగుతుండేవాడని, భార్యభర్తల మధ్య తరచూ గొడవలు ఉండేవని తెలిసిందన్నారు. పెద్దలు రంగప్పకు సర్ది చెప్పినా అతనిలో మార్పు రాకపోవడంతో మనస్థాపంతో సావిత్రమ్మ జీవితంపై విరక్తి చెంది పూలచెట్లకు వాడే పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడటంతో తిరుపతి స్విమ్స్‌లో చేర్పించారని అన్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిందనే ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.